నేడు దుర్గామల్లేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ చౌరస్తాలోని శ్రీదుర్గా మల్లేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం ఈనెల 15వ తేదీన నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురవారం ఉదయం అమ్మవారికి పంచామృతంతో అభిషేకం, నూతన వస్త్ర అలంకరణ, ఒడి బియ్యం పోయుట, సామూహిక కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ చంద్రారెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతరావు వస్తున్నారని తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల బరిలో మాజీ సైనికులు

పంజగుట్ట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ సైనికులు ఏర్పాటు చేసిన వీరో కె వీర్ ఇండియన్ పార్టీ తరఫున భారతదేశ వ్యాప్తంగా మొత్తం 543 స్థానాల్లో అభ్యర్థులను నిలుపుతున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజేశ్వర్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నుంచి తెలంగాణలో నిలబడబోయే ఐదుగురు అభ్యర్థుల జాబితా ప్రకటించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజేశ్వర్ నిజామాబాద్ నుంచి, మల్కాజ్‌గిరి నుంచి పి.సత్యనారాయణ స్వామి, చేవెళ్ల నియోజకవర్గం నుంచి పి.పెంటారెడ్డి, నల్లగొండ నుంచి పెదమాను సైదులు, మహబూబ్‌నగర్ నుంచి ఎమ్.ఆర్.కె.రెడ్డిలు అభ్యర్థులుగా బరిలో ఉంటామని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 17 స్థానాల్లో పోటీలో ఉంటామని దేశ వ్యాప్తంగా 543 స్థానాల్లో కేవలం మాజీ సైనిక ఉద్యోగులే అభ్యర్థులుగా ఉంటారన్నారు. దేశం కోసం ప్రాణాలు ఇచ్చేందుకు వెనకాడని మాజీ సైనికులం తిరిగి ప్రజలకోసం ఏదైనా చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పార్టీ గుజరాత్‌లో ఆవిర్భవించిందని తమ జాతీయ అధ్యక్షులు లాల్‌జీభాయ్ బాదర్ ఆదేశాలమేరకే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు.

నేనంటే.. నేనే..!

లోక్‌సభ సీటుపై కన్నేసిన నాయకుల్లో పోటాపోటీ



- కోడ్ కూయలే.. అభ్యర్థిత్వం ఖరారు కాలేదు..
- నియోజకవర్గంలో ప్రచారంలోకి ఆశావహులు
- ఫ్లెక్సీలు, ప్రచార రథాలు, వాల్ రైటింగ్‌లు
- మరోపక్క సీటుపై స్థానిక నేతల లోకల్ నినాదం

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) నుంచి ఆశావహుల తాకిడి అధికంగా ఉంది. పార్టీ అధిష్టానం అభ్యర్థుల జాబితా తయారీలో తలమునకలై.. గెలుపు గుర్రాల ఎంపికపై కసరత్తు ముమ్మురం చేస్తున్న నేపథ్యంలోనే.. ఈ లోక్‌సభపై కన్నేసిన ఆశావహులు తమకే టికెట్ ఖరారైనట్లుగా.. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార ఆర్భాటంలో భాగంగా ఫ్లెక్సీల ఏర్పాటు, గోడలపై వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మరికొందరైతే.. మరో అడుగు ముందుకేసి వాల్‌పోస్టర్లు అతికించడంతో పాటు ఎన్నికల ప్రచార రథాలను పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో తిప్పుతున్నారు. పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేయక ముందే.. పలువురు నేతలు ఎన్నికల ప్రచారాన్ని మరిపించేలా కార్యక్రమాలను చేపట్టడంపై ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది.

- ఇటీవల ఢిల్లీలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నివాసంలో లోక్‌సభ అభ్యర్థుల విషయమై రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు కె.లక్ష్మణ్, డీకే అరుణ, మురళీధర్‌రావు, బండి సంజయ్, ఈటల రాజేందర్, గరికపాటి మోహన్‌రావు, జితేందర్‌రెడ్డి, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ సమావేశమయ్యారు. ఇందులో రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల దరఖాస్తులను పరిశీలించగా, ఇందులో మల్కాజిగిరి స్థానానికి ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు గ్రహించారు. ఈ సీటు కోసం మాజీ మంత్రి ఈటల రాజేందర్ పోటీ పడుతున్నారు. తనకున్న ప్రజాదరణ, రాజకీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని మల్కాజిగిరి సీటు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. అలాగే, ఇదే సీటును మురళీధర్‌రావు ఆశిస్తున్నారు. దశాబ్దాలుగా తనకున్న జాతీయ స్థాయి అనుభవం, పార్టీకి అంకితభావంతో పనిచేయడం పరిగణనలోకి తీసుకుని పోటీకి అవకాశం ఇవ్వాలని ఈయన అడుగుతున్నట్లు తెలుస్తోంది. వీరే కాకుండా మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, కొంపల్లి మోహన్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమురయ్య కూడా ఈ సీటును కోరుతున్నారు. ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థిత్వం ఖరారు నిర్ణయాన్ని అధిష్టానానికి అప్పగించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

పోటాపోటీగా ఆశావహులు హల్‌చల్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్, కంటోన్మెంట్ ఉండగా, ఇటీవల జరిగిన శాసనసభా ఎన్నికల్లో అంతటా బీఆర్ఎస్ విజయం సాధించగా, బీజేపీ రెండో స్థానాన్ని దక్కించుకుంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభంజనంతో సులభంగా.. మల్కాజిగిరిలో బీజేపీ గెలుస్తుందన్న ధీమా ఉండటం వల్ల.. ఈ సీటుపై ఆశావహుల సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆశావహులు పార్టీ అధిష్టానంతోపాటు ప్రజల అభిమానాన్ని చూరగొనేందుకు.. ఎన్నికల ప్రచార ఆర్భాటానికి తెరలేపినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే టికెట్ ఆశిస్తున్న ఆశావహులందరూ గోడలపై వాల్ రైటింగ్‌కు శ్రీకారం చుట్టారు. మరికొందరు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు పోస్టర్లు కూడా అంటిస్తున్నారు. పార్టీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు అయితే.. ఏకంగా ఎన్నికల ప్రచార రథాలనే నియోజకవర్గం పరిధిలో ప్రచారానికి తిప్పుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడలేదు.. పైగా పార్టీ అధిష్టానం కూడా అభ్యర్థుల జాబితాను ఖరారు చేయలేదు. ఆశావహులు మాత్రం ఎన్నికల పోటీకి సిద్ధమవుతుండటంతో పాటు పలు కార్యక్రమాలతో ప్రజల వద్దకు వెళ్లడం కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది.

స్థానిక పార్టీ నేతల్లో లోకల్ నినాదం..

మల్కాజిగిరి పార్లమెంట్ సీటుపై స్థానిక పార్టీ నాయకులు తీసుకువచ్చిన లోకల్ నినాదం కూడా కేడర్‌లో చర్చనీయాంశం అవుతోంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంపై కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, మధ్యప్రదేశ్ పార్టీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమురయ్య గురిపెట్టి ఎన్నికల ప్రచార కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో స్థానిక నేతలు కలవరానికి గురవడంతో పాటు లోకల్ నినాదాన్ని ముందుకు తెస్తున్నారు. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు కొన్నాళ్లుగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తూ.. కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించడం.. మరికొందరు నాయకులు ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడం వంటి విషయాలు స్థానిక నాయకుల లోకల్ నినాదానికి కారణంగా చర్చ సాగుతోంది. ఏది ఏమైనా.. అభ్యర్థుల జాబితా ఖరారు కాకముందే.. ఆశావహులు మల్కాజిగిరి నియోజకవర్గంలో తామే అభ్యర్థి అన్నట్లుగా ఎన్నికల ప్రచార ఆర్భాటానికి వెళ్లటం ఈ రచ్చకు కారణమవుతోంది. స్థానిక పార్టీలో నెలకొన్న అయోమయం, లోకల్ చర్చ తదితర అంశాలకు అధిష్టానం ఏవిధంగా తెరదింపుతుందో వేచి చూడాల్సిందే.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



ఈదమ్మ, ఎల్లమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా బుధవారం సరస్వతి పూజ, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత పంచశీల శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు డి. అనిత, ఉపాధ్యాయులు, నవిద్యార్థులు పాల్గొన్నారు.



పంచశీల స్కూల్‌లో సామూహిక అక్షరాభ్యాసం

వైభవంగా ఈదమ్మ, ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మూసాపేట: మూసాపేటలో ఈదమ్మ, ఎల్లమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన చేశారు. మాజీ కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్, బాబూరావు, బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజవర్గం ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనీ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నోమల సుందర్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సలహాదారులు స్వామి, రాజు, యాదయ్య, శంకర్, కోశాధికారి ప్రవీణ్, నరేష్, శ్రీశైలం, శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరత రామకృష్ణ, బాబు, మల్లేష్, అశోక్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

18న జాతీయ కరాటే పోటీలు

పంజగుట్ట: ప్రతి ఆడపిల్లకు సెల్ఫ్ డిఫెన్స్ తప్పక నేర్పించాలని ప్రముఖ సినీ హీరో సుమన్ తల్వార్ అన్నారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న 4వ జాతీయ ఓపెన్ కరాటే, కుంగ్‌ఫ్యూ, థైక్వాండో చాంపియన్ షిప్స్ 2024 మెడల్స్‌ను ఆయన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ... సమాజంలో మహిళలు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నారని, చిన్నచిన్న పిల్లల్ని మానభంగం చేస్తున్నారని ఇలాంటి సమయంలో ఎవర్నివారు కాపాడుకునే సామర్థ్యం పెంపొందించాలన్నారు. కొంతమంది తన ఫొటో పెట్టుకుని వివిధ రకాల ప్రచారాలు చేస్తున్నారని, ఒకరైతే తాను ఎంపీగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారని ఎవరూ అలాంటివి నమ్మరాదని తన ఫొటో ఉంటే కాదు తాను వీడియో తీసి ఏదైనా చెపితేనే నమ్మాలని సూచించారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ నిర్వాహకురాలు లక్ష్మి సామ్రాజ్యం మాట్లాడుతూ... పోటీల్లో మొత్తం 14 రాష్ట్రాల నుండి క్రీడాకారులు పాల్గొంటారని, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, కోచ్‌లు అందరూ కలిసి సుమారు 3వేల మందికి పైగా హాజరు కానున్నట్లు తెలిపారు. అందరికీ ఉదయం నుండి రాత్రి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

కల్యాణం.. కమనీయం

సెవెన్ హిల్స్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి వారి నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా తిరుకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు సతీసమేతంగా పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు. – భాగ్యనగర్‌కాలనీ



తిరుకల్యాణ మహోత్సవంలో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు దంపతులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి ఓబీసీ సెల్ చైర్మన్‌గా ఎర్వ శ్రీరాములు



నియమాక పత్రం అందుకుంటున్న ఎర్వ శ్రీరాములు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే నాయకులను అధిష్టానం గుర్తించి తగిన ప్రాధాన్యం ఇస్తారని ఓబీసీ సెల్ చైర్మన్ ఎర్వ శ్రీరాములు తెలిపారు. బుధవారం టీపీసీసీ ఓబీసీ సెల్ మేడ్చల్ జిల్లా చైర్మన్ గువ్వ రవి ముదిరాజు చేతుల మీదుగా నియమాక పత్రం అందుకున్న ఎర్వ శ్రీరాములు మాట్లాడారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. తనను ఓబీసీ సెల్ చైర్మన్‌గా నియమించినందుకు జాతీయ కాంగ్రెస్ ఓబీసీ సెల్ విభాగం చైర్మన్ అజయ్‌సింగ్ యాదవ్, తెలంగాణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ విభాగం చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు.

అడ్డగోలుగా రోడ్ల తవ్వకాలు

అనుమతులు లేకుండా దొడ్డిదారిన డ్రైనేజీ పైపులైన్ పనులు



భాగ్యనగర్‌కాలనీ ఫేజ్ 3లో రోడ్డును తవ్వి డ్రైనేజీ పైపులైన్ పనులు చేపడుతున్న దృశ్యం



కోనసీమ వంటిల్లు హోటల్ ఎదురుగా రోడ్డును తవ్వి పనులు పూర్తి చేసిన దృశ్యం

భాగ్యనగర్‌కాలనీ: అసలే అధ్వానపు రహదారులు. ఎక్కడ చూసినా గుంతలు, ఇరుకు రోడ్లు. అధ్వానపు రోడ్ల దుస్థితిపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించరు. అయితే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజలు అవసరాల కోసం వేసిన రోడ్లను ఇష్టానుసారంగా రాత్రికి రాత్రి తవ్వి పోస్తూ ప్రజా సొమ్మును దుర్వినియోగం పాలు చేస్తున్నారు. రోడ్డు తవ్వాలంటే జీహెచ్ఎంసీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే అటువంటి నిబంధనలు ఇక్కడి ప్రజలకు వర్తించవు. హైదర్‌నగర్ డివిజన్‌లో ఇటీవల కాలంలో ఎక్కడ చూసినా రహదారులను అడ్డగోలుగా తవ్వి పోస్తున్నారు.

◆ అండర్ గ్రౌండ్‌డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల పనుల కోసం జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే ఇష్టానుసారంగా రోడ్లను తవ్వి పోస్తూ దర్జాగా పైపులైన్ పనులు చేపడుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఇంటి నిర్మాణం చేపట్టే యజమానులు పైపులైన్ పనులకు అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అంతేకాకుండా స్థానిక కాలనీ వాసులు, వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలో ఇటీవల కోనసీమ వంటిల్లు హోటల్ ఎదురుగా ఓ భవన నిర్మాణదారుడు అదనపు ఫ్లోర్ నిర్మించి అక్రమంగా నిర్మాణం చేపట్టడమే కాకుండా దొడ్డిదారిన రోడ్డు తవ్వి డ్రైనేజీ పైపులైన్ పనులు ముగించాడు.

కన్నెత్తి చూడని అధికారులు..

◆ అదే విధంగా భాగ్యనగర్‌కాలనీ ఫేజ్ 3లో రోడ్డును తవ్వి స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందజేసిన వారు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. అంతేకాకుండా వారి నుంచి ఆమ్యామ్యాలు దండుకొని వారిని ప్రోత్సహిస్తున్నట్లు కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా చేపడుతున్న పైపులైన్ పనులను జీహెచ్ఎంసీ వాటర్‌వర్క్స్ అధికారులు నిలువరించకపోతే రోడ్డు నిర్మాణం చేపట్టినా.. చేపట్టకపోయినా శూన్యంగానే మిగిలిపోతోంది.

ఘనంగా దామోదర సంజీవయ్య జయంతి

మూసాపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతిని బుధవారం మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర దళిత నాయకులు కర్క పెంటయ్య పాల్గొని సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంజీవయ్య అత్యంత పేద కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలను ఎదుర్కొని అంచెలంచలుగా ఎదిగి ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. మాజీ ప్రధానులు పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో శారదారెడ్డి, అంబేడ్కర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కర్క దాకయ్య, బీసీ నాయకులు బొశెట్టి నర్సింగరావు, జెల్ల రాము, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కర్క నిఖిల్, కర్క చిన్న సాయి, సదా మహేష్, కర్క మహేష్, పెరుమాండ్ల నర్సింగ్, ఖాన్, భాషా తదితరులు పాల్గొన్నారు.



దామోదర సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

యూజీడీ పనులు ప్రారంభం

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్‌స్టాప్, వాటర్ ట్యాంక్ వద్ద రూ.12.50లక్షలతో యూజీడీ పనులను బుధవారం కార్పొరేటర్ శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో డివిజన్‌లోని అన్ని బస్తీల్లో మౌళిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు వైష్ణవి, శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, మధు, సీనియర్ నాయకులు వార్డు మెంబర్ పవన్‌కుమార్, రంగమోహన్, ధనలక్ష్మి, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీకాలనీలో పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శిరీష

18న 'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఈనెల 18న 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'అప్రిషియేటివ్ ఇన్‌క్వైరీ' అనే అంశంపై టర్కీ దేశానికి చెందిన పర్సనల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ యోగేష్‌శర్దా ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 60, బెండ 60, కాకర 60, దొండ 60, దోస 30, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 40, చిక్కుడు 50, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 350.

మహిళలకు నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. వివరాలకు 9603196925 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

ఇఫ్లూలో ఒకరోజు వర్క్‌షాప్

రాయదుర్గం: అకడమిక్, జర్నలిస్టిక్ రైటింగ్‌ను ఒకచోట చేర్చే ప్రయత్నం చేస్తున్నామని ఇఫ్లూ యూనివర్శిటీలోని ఫిల్మ్ స్టడీస్ విభాగం హెడ్ ప్రొఫెసర్ హెచ్ నిఖిల పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూనివర్శిటీ ఫిల్మ్ క్లబ్, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ఆధ్వర్యంలో ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఫిల్మ్ రివ్యూలు రాయడంపై ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన 40 మందికి పైగా విద్యార్థులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఫిలిమ్ క్లబ్ విద్యార్థుల కోసం ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను తీసుకువస్తుందన్నారు. అనంతరం కల్చరల్ యాక్టివిటీ సెంటర్‌లో 9 నిమిషాల నిడివి గల షార్ట్ పిల్మ్ హెయిర్ కట్ చిత్రాన్ని ప్రదర్శించారు.

ఘనంగా మైసమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

గచ్చిబౌలి: గచ్చిబౌలి ఇందిరానగర్‌లోని మైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

లిబర్టీ: ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ. 12 వేలు చెల్లించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు భారతీయ మజ్దూర్ సంఘ్ ఆటో విభాగడం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుద్రాక్ష మల్లేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ప్రతినిధి బృందం బీర్ల ఐలయ్యను కలిసి ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆయా సమస్యలను ముఖ్యమంత్రి రేంతర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఐలయ్య హామీ ఇచ్చారు.

రేపటి నుంచి నానక్‌రాంగూడ రంగనాథుడి బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఐటీకారిడార్‌లో శతాబ్దాల చరిత్ర కలిగిన రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఈనెల శుక్రవారం నుంచి 23వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి



జ్యూట్ బ్యాగ్ బ్యాగులు పంపిణీ చేస్తున్న రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకుడు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పాపిరెడ్డి నగర్ కూరగాయాల మార్కెట్‌లో జ్యూట్ బ్యాగుల సంచులు వాడుకలోకి తీసుకురావాలని ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు రమేష్, నరసింహ, శ్రీనివాస్, నర్సింగ్ యాదవ్, సుశీల, జ్యోతి, మీనా, కోటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా 'క్యాంపస్ టూ కార్పొరేట్'

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచడం ద్వారా పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా వారిని సిద్ధం చేసే 'క్యాంపస్ టు కార్పొరేట్' కార్యక్రమాన్ని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సి.శ్రీనాథ్ ప్రారంభించారు. యువత లో నైపుణ్యాలు-ఉపాధి కల్పన అంతరాన్ని తగ్గించేందుకు ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ హిందుస్థాన్ కోకాకోలా బెవరేజెస్ (హెచ్‌సీసీబీ), తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్-నాలెడ్జ్ (టాస్క్), ఆహాన్ కన్సల్టింగ్‌లు దీనిని నిర్వహిస్తున్నాయని ఈ ఏడాదిలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన దాదాపు 5000 మంది ఆఖరి సంవత్సరం డిప్లొమా విద్యార్థుల ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకున్నామని నిర్వాహకులు తెలిపారు.

ఎస్టీ మోర్చా ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించాలని బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బుధవారం ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకొని ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్‌నాయక్‌తో పాటు పలువురిని అరెస్ట్ చేశారు. ఫిబ్రవరి 15న పూర్తిస్థాయి సెలవుతో పాటు బంజారాహిల్స్‌లో 108 అడుగుల సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.